నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | ఫిబ్రవరి 25, 2024 | www.navatelangana.com

ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఎంపీ

- ఎంపీకి ఆలయ అధికారుల ఘన సన్మానం

నవతెలంగాణ-మద్నూర్



మద్నూర్ ఉమ్మడి మండల నివాసులు ప్రస్తుత జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ శనివారం తెలంగాణ రాష్ట్రానికి పూర్తిగా సరిహద్దులో గల మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన ఎంపీ బీబీ పాటిల్ కు ఆలయ అధికారి వేణు ప్రత్యేకంగా సన్మానించారు. ఆయన వెంట దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలుగౌడ్, బిజెపి నాయకులు కృష్ణపటేల్, పొతంగల్ బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

- ఉపాధిహామీ పీడీ సాయగౌడ్

నవతెలంగాణ-కోటగిరి



ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఉపాధిహామీ పీడీ సాయగౌడ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పీడీ సాయగౌడ్ ఆకస్మికంగా ఉపాధిహామీ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ అధికారి మనోహర్‌రెడ్డిని ఉపాధి హామీ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని, ప్రతి ఒక్కరికి 200 రూపాయల కూలీ వేతనం రావాలని ఆదేశించారు. పని పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తరచూ ప్రమాదాలు

- భిక్కనూర్ రావాలంటే జంకుతున్న వాహనదారులు
- సూచికలు, రోడ్డు వెడల్పు చేసినా.. ఆగని ప్రమాదాలు
- మూసివేయడం లేదా బ్రిడ్జి నిర్మాణం ఒక్కటే మార్గం

నవతెలంగాణ-భిక్కనూర్

44వ జాతీయ రహదారి నుంచి భిక్కనూర్ పట్టణానికి వెళ్లే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. హైవే నుంచి భిక్కనూర్ పట్టణానికి మళ్లే క్రమంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తరచూ ప్రమాదాలతో గమనించి అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసినా.. రోడ్డు వెడల్పు చేసినా.. ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు.

రామాయంపేట్ వైపు నుంచి భిక్కనూరు పట్టణానికి వెళ్తున్న సమయంలో మూలమలుపు వద్ద ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో బస్వాపూర్, సిద్ధ రామేశ్వరనగర్, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పనుల నిమిత్తం భిక్కనూర్‌కు వస్తున్న సమయంలో వెనుక నుండి వస్తున్న వాహనాలు ఢీకొనడం లేదా హైదరాబాద్ వైపు వెళుతున్న వాహనాలు ఢీకొనడం వంటి ఘటనలలో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల కాలంలో భిక్కనూర్ పట్టణానికి చెందిన దంపతులు దైవదర్శనం ముగించుకొని ఇంటికి తిరుగు ప్రయాణంలో జరిగిన ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి.

ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున పట్టణానికి చెందిన రామదండు సంఘం సభ్యులు రహదారిని మూసివేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్ఎఐ అధికారులు రహదారిని మూసివేసే క్రమంలో బజరంగ్‌దళ్ యువకులు మూసివేతను అడ్డుకొని బ్రిడ్జి నిర్మించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

ప్రమాదాలు జరగకుండా నివారించడానికి పోలీసులు, ఎంవిఐ అధికారులు జంగంపల్లి, పోలీస్‌స్టేషన్ బ్యాక్ సైడ్ పెట్రోల్ పంపు వద్ద, చర్చి వెనకాల మూలమలుపు ప్రమాదాల స్థలాలను శుక్రవారం పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా జాతీయ రహదారి అధికారులు ఇండికేటర్ లైట్‌లను, రైలింగ్ హద్దులను ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎక్కువగా ప్రమాదాలు జరగడానికి కారణం రామయంపేట్ వైపు నుండి భిక్కనూరు వస్తున్న సమయంలో జాతీయ రహదారి ఎత్తు నుంచి క్రిందికి ఉన్న కారణంగా వెనుక నుండి వస్తున్న వాహనాలు అతివేగంగా రావడం, మూలమలుపు దగ్గరికి వచ్చిన తర్వాత యూటర్న్ కావడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే జంగంపల్లి మూలమలుపు వద్ద దాబా హోటళ్ల వద్ద భారీ లారీలు నిలపడం, పోలీస్‌స్టేషన్ బ్యాక్ సైడ్ ప్రమాద సూచికలు లేకపోవడం వంటి కారణాల వలన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదాల నివారణకు రామాయంపేట వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాలు ప్రక్కన ఉన్న మట్టి రోడ్డు ద్వారా ఎల్లమ్మ దేవాలయం బ్రిడ్జి కింద నుంచి భిక్కనూరు పట్టణానికి వెళ్లవచ్చు. లేదా బ్రిడ్జి నిర్మాణం, రహదారిని మూసివేయడం ప్రత్యామ్నాయ మార్గాలుగా కనిపిస్తున్నాయి. అలాకాకుండా మరికొద్ది దూరం ముందుకు వచ్చి రామేశ్వర్‌పల్లి బ్రిడ్జి నుంచి పట్టణానికి రావచ్చు. ప్రమాదాల కారణంగా కొందరు ద్విచక్ర వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వస్తుంటే మరికొందరు మూలమలుపు మలిగివస్తున్నారు.

ఏది ఏమైనప్పటికీ మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోలుతున్న కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా బ్రిడ్జి నిర్మాణం, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



హైవే నుంచి భిక్కనూర్‌కు వెళ్లే రోడ్డు ఇదే



ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మహిళ

చివరి ఆయకట్టుకు నీరందేనా..?

- ముళ్ల కంప, తుంగ, పిచ్చిమొక్కలతో కాలువలు
- శిథిలావస్థలో కాలువలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మధ్యతరహా ప్రాజెక్టు కౌలాస్‌నాళా ప్రాజెక్టు కాలువల నుంచి చివరి ఆయకట్టు వరకు సాగునీరందేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రధాన కాలువతో పాటు ఆరు పిల్లకాలువలను ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. ప్రాజెక్టు నుంచి సాగునీరు జుక్కల్, బిచ్కుంద మండలంలోని గ్రామాల రైతుల పంటల సాగుకు అందించేందుకు రూపకల్పన చేసినా.. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడం లేదనేది రైతుల నుంచి వస్తున్న ఆరోపణ.

సుమారుగా అధికారుల అంచన ప్రకారం 12000 ఎకరాలకు సాగు నీరందించాలని ప్రతిపాదించారు. జుక్కల్ మండలంలోని కౌలాస్, సావర్‌గావ్, సావర్‌గావ్ తాండా, ఖండేభల్లూర్, మహమ్మదాబాద్, కేమ్రాజ్‌కల్లాలీ, లాడేగాం, కల్లాలీతండా, జుక్కల్, బస్వాపూర్, బిచ్కుంద మండలంలోని శాంతాపూర్, తక్కడ్‌పల్లి, తుప్‌దాల్, పెద్ద దడ్గి, రాజపూర్, జగన్నాథ్‌పల్లి, బండరెంజల్ గ్రామాలలోని సాగునీరు రెండుపంటలు అందించి చెరువులు, కుంటలు నింపడంతో పాటు రెండు పంటలకు నీరందించాలి.



కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

ముళ్ల కంపలు, పగుళ్లతో శిథిలమైన కాలువలు..

ప్రాజెక్టు నీరు పంటలకు విడుదల చేసినప్పుడు కాలువలలో నీరు పూర్తి స్థాయిలో చివరి అయకట్టు వరకు మొదటి నుంచి లెక్కకపోవడంతో రైతుల ఆశలు వడుయాసలు అయ్యాయి. నీరున్న కాలవలు శిథిలమైపోయాయి. కాలువలలో ముళ్ల కంపలు, సిల్ట్ మట్టి, పగుళ్లు, తుంగ, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో నీరు చివరి ఆయకట్టు వరకు పారడం లేదు.

పట్టించుకోని సంబంధిత శాఖ..

కౌలాస్‌నాళా ప్రాజెక్టుల ప్రారంభం నుంచి చిన్న చూపే. అడిగేవారు లేకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఎప్పుడు అధికారులను కదిలించిన కాలువల మరమ్మతులకు నిధులు లేవని చెప్పడం తప్ప చేసేది ఏమీ లేదనేది చెబుతూవచ్చారు. అప్పుడప్పుడు వచ్చిన నిధులు ఎక్కడ పనులు చేశారో, చేయకుండానే చేసినట్టు రికార్డులు చేశారనేది మండల రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఎండుతున్న వరి పంట

- అడుగంటిన భూగర్భజలాలు

నవతెలంగాణ-రామారెడ్డి

వర్షాకాలం చివరి రెండు నెలలు వర్షాలు కురువకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వరి పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయి.

మండలంలో 9496 మంది రైతులు 12,743 ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. వరి పంట సాగు చేపట్టి సుమారు నెల 15 రోజులవుతోంది. ఇప్పుడే భూగర్భ జలాలు అడుగంటి, వరి సాగుకు బోర్లు నీరు అందించకపోవడంతో పంట ఎండుముఖం పడుతోంది. వరి కోతలు చేపట్టడానికి మరో రెండు నెలలు పడుతుంది. పంట చేతికి రాకముందే పంట ఎండుముఖం పట్టడంతో రైతులు అందోళన చెందుతున్నారు.



నీరు లేక వరి మడిలో పగుళ్లు..

అంగన్వాడీలకు బిఎల్ఓ డ్యూటీ డబ్బులు ఇవ్వాలి

- జిల్లా అధ్యక్షురాలు బాబాయ్

నవతెలంగాణ-కామారెడ్డి

అంగన్వాడి టీచర్లు బిఎల్ఓ డ్యూటీ నిర్వహించారని బిఎల్ఓ డ్యూటీ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరుతూ అంగన్వాడీలు శనివారం తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు బాబాయ్ మాట్లాడుతూ.. పల్వాంచ మండలంలో అంగన్వాడీ టీచర్లు అసెంబ్లీ ఎన్నికల్లో, అంతకుముందు ఇంటింటికి తిరుగుతూ యువతను ఓటర్ నమోదు చేయించడంలో కీలకపాత్ర వహించారని, పై అధికారుల ఆదేశానుసారం తాము డ్యూటీలో పాల్గొన్నామని ఇంత కష్టపడితే బిఎల్ఓ డబ్బులు చెల్లించలేదన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి బీఎల్వో డ్యూటీ డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి మాచారెడ్డి మండల అంగన్వాడీ టీచర్లు, సిఐటియు నాయకులు చంద్రశేఖర్, మండల నాయకురాలు బట్ట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు

గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

- జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రజిత

నవతెలంగాణ-కామారెడ్డి

గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతుందని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారు నిర్వహిస్తున్న బ్యాంకింగ్ ఆర్అండ్‌బీ, ఎస్ఎస్సి, ఎక్సమ్స్ కొరకు (2) బ్యాచ్ (5) నెలలు ఉచిత రెసిడెన్షియల్ ఫౌండేషన్ కోర్సు కోచింగ్ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల తెలంగాణ షెడ్యూల్డ్ కులముల స్టడీ సర్కిల్ బ్రాంచిలలో 18-03-2024 నుంచి 17-08-2024 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్/ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన 100 మంది అభ్యర్థులకు ఆన్లైన్ విధానంలో www.tsstudycircle.com.inలో 23-02-2024 నుంచి 06-03-2024 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ ముగించిన తర్వాత అభ్యర్థులు ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష జిల్లా కేంద్రంలో 10.03.2024 ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 01.00 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న (5) నెలల రెగ్యులర్ ఫౌండేషన్ కోర్సు, తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారు నిర్వహించిన సివిల్ సర్వీసెస్ కొరకు శిక్షణ పొందిన వారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోనుటకు అర్హులు కారని, కావున ఈ విషయమును గమనించి నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్, ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

పంట పొలాలను పరిశీలించిన ఏడిఏ అపర్ణ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి, భిక్కనూర్ ఆయా గ్రామాలలో వరి పంట పొలాలను ఏడిఏ అపర్ణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వరి పంటకు మందులు వాడాలని, చీడపురుగుల నివారణ కొరకు ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ పరిశీలనలో వ్యవసాయ అధికారి రాధా, ఏఈవోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పోచారం ప్రధాన కాలువలో పడి ఒకరి మృతి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



పోచారం ప్రధాన కాలువలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి ఎక్కపల్లి గ్రామానికి చెందిన కిషన్ (66) సంవత్సరాలు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఎక్కపల్లి గ్రామానికి చెందిన కిషన్ తమ కుటుంబ సభ్యులతో కలిసి గోపాల్‌పేట్ గ్రామంలో కొలువైన నల్ల పోచమ్మ ఆలయానికి మొక్కు తీర్చుకోవడానికి వచ్చాడు. చీనూర్ శివారు నుంచి పారుతున్న పోచారం ప్రధాన కాలువ పక్కన వంట వార్పు చేసిన అనంతరం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన కిషన్ కాలుజారి ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి వెతికిన ప్రయోజనం లేకుండా పోయింది. శనివారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాలించగా కాలువలో కిషన్ పైకి తేలుతూ కనిపించాడు. కొడుకు నర్సింలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలో రాజకీయాలు రోజుకొక మలుపు తిరుగుతున్నాయి. శనివారం కోటగిరి ఎంపీటీసీ సలీం, నాయకులు నజీర్, బస్వపూర్ గ్రామానికి చెందిన నాయకులు నాగరాజు, రాములు, శివ తదితరులు బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

విద్యుత్ అధికారులు
గ్రౌండ్ లెవల్‌లో ఉండి పనులు చేయాలి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-పిట్లం

విద్యుత్ శాఖ అధికారులు కచ్చితంగా గ్రౌండ్ లెవెల్‌లో ఉండి పనులు చేయాలని ట్రాన్స్‌కో ఏఈ బుచ్చిబాబును స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆదేశించారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖపై సమీక్ష నిర్వహిస్తుండగా కారేగామ ఎంపీటీసీ రాజు సమీక్షపై ఆగ్రహిస్తూ ఇటీవల పేద వర్గాలకు మీటర్ కనెక్షన్లు ఇవ్వనందున వారు వైర్లు తగిలించి వాడుకోవడంతో కేసులు నమోదు చేశారని సభ ముందు విద్యుత్ ఏఈ బుచ్చిబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో వివిధ కాలనీలలో నడిరోడ్డుపై విద్యుత్తు పోల్స్ ఉండడంతో ప్రజలకు అంతరాయం ఏర్పడుతుందని, కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని గత నాలుగు సంవత్సరాలుగా చెప్పినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు తమ ప్రవర్తన తీరును మార్చుకోవడం లేదని జెడ్పీటీసి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది మధ్యాహ్నం సమయం నుంచి రాత్రి వరకు ఏ ఒక్క డాక్టర్ గానీ హెడ్‌నర్స్‌లు ఉండడం లేదని, ఏ చిన్న గాయమైన పేషంట్‌లను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి రేఫర్ చేస్తున్నారని ఆరోపించారు. వేసవి దృష్ట్యా మండలంలో పశువులకు నీటి తొట్టెలను నిర్మించాలని సభ ముందు సభ ముందుంచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలపై విద్యుత్తు, విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేయరాదని, స్పష్టమైన ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని అన్నారు. గృహ, రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యార్థం తనకు ప్రపోజల్ ఇవ్వాలని డాక్టర్ రోహిత్ కుమార్‌ను ఆదేశించారు. నిజాంసాగర్ మండలం జక్కాపూర్ వద్ద నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు మందకోడిగా, నిర్లక్ష్యంగా సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్చి 5 వరకు నివేదికలు ఇవ్వాలని ఇరిగేషన్ ఏఈ రాజ్ కమల్‌ను ఆదేశించారు. ఈ పనులపై త్వరలో సంబంధిత శాఖ మంత్రితో రివ్యూ సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని గ్రామాలలో విద్యార్థుల నిమిత్తం రూటు బస్సులను నడపాలని ఆర్టీసి అధికారులను కోరారు. విద్యాశాఖలో డిప్యూటేషన్లను ప్రోత్సహించవద్దని, ఎక్కడ పోస్టింగ్ ఉంటే అక్కడే ఆ ఉపాధ్యాయుడు విధులు నిర్వహించాలని, మౌఖిక ఆదేశాలు ఇవ్వవద్దని ఎంఈఓ దేవిసింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఆయా శాఖల అధికారులు నివేదికలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లచ్చిరెడ్డి, విండో చైర్మన్ శపథంరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సింగిల్ విండో చైర్మెన్

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని చిల్లేర్గి (పిట్లం) సహకార సంఘం చైర్మన్ ఒంటరి శపథంరెడ్డి బిఆర్ఎస్ పార్టీ వీడి ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో ఆయన నివాసంలో శనివారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలన విధానాలకు, పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్‌రెడ్డి, జంబిగే హన్మాండ్లు, మోహన్‌రెడ్డి, సూరత్‌రెడ్డి, చింతల సాయిరెడ్డి, చిప్ప శివ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుకు కీలకమైన యువత, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న మత్తు పదార్థాల రవాణా కాకుండా చూడాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి వాటి నియంత్రణకు చేపట్టవలసిన చర్యలను వివరించారు. సమాజానికి పెను ప్రమాదకరంగా మారిన మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటు పడి వాటికి బానిసలుగా మారిన వారు వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా నష్టపోతారన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో దుష్పరిణామాలపై యువతకు అవగాహన కల్పించేందుకు విస్తృతస్థాయిలో చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి బావయ్య, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, విద్య, వైద్యం, ఐసిడిఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ఆడుకునేందుకు వెళ్లి.. మృత్యుఒడికి

- చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి
- ఒకరిని కాపాడబోయి నీటమునిగిన మరొకరు
- కామారెడ్డి జిల్లా గాంధారి మండలం ముదెల్లిలో ఘటన
- గ్రామంలో విషాధచాయలు

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-గాంధారి



ఆడుకునేందుకు వెళ్లిన చిన్నారులు మృత్యుఒడికి చేరుకున్నారు. చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఈ విషాధ ఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని ముదెల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది.

నిజాంషుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాం

- కేబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ శ్రీధర్ బాబు
- ఫ్యాక్టరీ పరిశీలన

వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ-బోధన్



బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని తప్పనిసరిగా పునరుద్ధరిస్తామని కేబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణలో భాగంగా కేబినెట్ సబ్ కమిటీతో కలిసి ఆయన ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ఆవరణలో రైతులకు ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు.



మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న వామపక్ష నాయకులు

పాస్‌పోర్టు కార్యాలయంలో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.20లక్షల వరకు ఆస్తినష్టం

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పాస్‌పోర్ట్ కార్యాలయంలో శనివారం ఉదయం ఏడున్నర గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం ఏడున్నర గంటలకు పాస్‌పోర్ట్ కార్యాలయంలో నుంచి పొగలు రావడంతో అక్కడే ఉన్న వాచ్‌మెన్ అప్రమత్తమై దర్వాజా ఓపెన్ చేసి చూడగా మంటలు రావడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి పాస్‌పోర్ట్ కార్యాలయం పూర్తిగా దగ్ధమైంది.

వివరాలు మెయిన్‌లో..

సంకర జాతి పశువులకు థైలేరిసిస్ టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ముల్లంగి(బి), గొట్టుముక్కల గ్రామల్లో సంకర జాతి ఆవులకు థైలెరిసిస్ టీకాలను వైద్యులు కిరణ్ దేష్ పాండే శనివారం వేశారు. 24 సంకర జాతి ఆవులకు టీకాలు వేశారు. ప్రతి రైతు సంకర జాతి ఆవులకు తప్పని సరిగా టీకాలు వేయించాలి వైద్యులు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఉమమ సహేర్ వస్, వి ఎల్ ఓ వినిత, జేవిఓ గంగజమున, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న వైద్యులు

రెవెన్యూ భూమి పరిశీలన

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని మద్దేపల్లి గ్రామ శివారులో రెవెన్యూ భూమిని అటవీ, రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు శనివారం పరిశీలించారు. మద్దేపల్లి శివారు అటవీ ప్రాంతంలోని 235 సర్వేనెంబర్‌లోగల 30 ఎకరాల రెవెన్యూ భూమిని నిజామాబాద్ ఎఫ్‌డిఓ సుధాకర్ రావు, ఆర్డీవో రాజేందర్ కుమార్, ఆర్అండ్‌బి. అధికారులు సంయుక్తంగా పరిశీలించి అటవీ శాఖకు అప్పగించేందుకు సర్వే ప్రారంభించారు. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేసి సర్వే వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వో నారాయణ, ఆర్ఐ మోహన్, సెక్షన్ ఆఫీసర్ జహుర్, ఆర్అండ్‌బి అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.



టిఎంహెచ్ఓసిఈయు
రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా డాక్టర్ కృష్ణవేణి



ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ (టిఎంహెచ్ఓసిఈయు) రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. అందులోను ఉపాధ్యక్షులుగా నిజామాబాద్ కి చెందిన ఈజెహెచ్ఎస్, వెల్నెస్ సెంటర్ ఇన్చార్జ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణవేణి, జాయింట్ సెక్రటరీగా జి. రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంగారం నియమితులైన సందర్భంగా నిజామాబాద్ కు చెందిన మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని కల్పించిన యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్‌కి, అసోసియేట్ అధ్యక్షులు డాక్టర్ శాంతి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి రఫీ ఉద్దీన్ కి, జనరల్ సెక్రెటరీ నూకం భిక్షపతికి, ట్రెజరర్ బొంకటి.సుభాష్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ అభివృద్ధికి, యూనియన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా ముందుకు సాగుతామని అన్నారు. సమావేశంలో నిజామాబాద్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగ సంఘాల నాయకులు వివిధ కేడర్లకు చెందిన పలువురు ప్రముఖులు ఈజెహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ ఉద్యోగులు అందరూ పాల్గొన్నారు.

ప్రాచీన ఖిల్లాను సందర్శించిన విద్యార్థులు



ఖిల్లావద్ద విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో వివిధ పాఠశాలల విద్యార్థులు శనివారం చారిత్రక ప్రదేశాల క్షేత్రస్థాయి పర్యటన చేశారు. మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు, వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్, మదర్ థెరిస్సా స్కూల్ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో అత్యంత ప్రాచీనమైన ఖిల్లాను సందర్శించారు. ఖిల్లా పరిరక్షణ సమితి అధ్యక్షుడు బ్రహ్మరౌతు నర్సింగ్ రావు విద్యార్థులకు ఖిల్లా యొక్క విశిష్టతను తెలియజేశారు. ముఖ్యంగా ఖిల్లా ప్రధాన ముఖద్వారం, ఖిల్లా చుట్టూ ఉన్న కందకం, అల్లయ్య కొండయ్య మందిరం, ఖిల్లా ప్రధాన గ్రైనీలు, సైదా నాభి ఘోరీ, అత్త కోడళ్ళ బావి, ఖిల్లాలో ఉన్న సొరంగ మార్గాలు, ఖిల్లా చారిత్రక విషయాలను విద్యార్థులకు వివరించారు. పర్యటనలో మైనారిటీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ వాణి, మదర్ థెరిస్సా స్కూల్, వెంకటేశ్వర స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి ,సుబ్బారెడ్డి, పాఠశాలల ఉపాధ్యాయ బృందం, ఖిల్లా పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు సయ్యద్ రియాజోద్దీన్ పాల్గొన్నారు.

ఓటర్ అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు శనివారం ఓటర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహసిల్దార్ గజానను, స్టేషన్ హౌస్ ఆఫీసర్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రాజా జెండా ఊపి ప్రారంభించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో విలువైందని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజగంగారం, ఆర్ ఐ అశోక్, మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, గురుకుల పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపానికి నిధులు మంజూరు చేయండి

- ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దండోర సంఘం నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలో ఉన్న మాదిగ దండోరా సంఘ సభ్యులు కళ్యాణ మండపం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ తెలిపారు. నిజాంబాద్ పట్టణంలోని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నివాసంలో మాదిగ దండోరా సంఘ సభ్యులు శనివారం కలిసి ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. కళ్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి సానుకూలంగా స్పందించారని ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రవి, ప్రసాద్ ,భోజన్న గంగన్న, సాయన్న, ప్రవీణ్, గంగాధర్ మాదిగ దండోరా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవాలు

- బ్రహోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు
- ఆలయాలవద్ద జాతరలు, అన్నదానాలు
- తరలివచ్చిన భక్తులు

నవతెలంగాణ-విలేకరులు

సిరికొండ: మండలంలోని మైలారం, సిరికొండ, కొండూరు, రావుట్ల, హుస్సేన్‌నగర్ తదితర గ్రామాలలో యజ్ఞం, రథోత్సవం, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లా రామాలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం సీతారామచంద్రులకు చక్రతీర్థం కార్యక్రమం అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. ఆనంతరం సీతాసమేతంగా స్వామివారు వన విహారం చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిత్యహెూమం, నిర్వహించారు. ఆ తర్వాత చక్రతీర్థంను అశేష భక్తజనం మధ్య విశేషంగా నిర్వహించారు. మండలం నుంచే కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అంగడి మామిళ్లలో జరిగిన జాతరకు భక్తులు తండోపతండాలు వచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. జాతరలో తినుబండారాల దుకాణాలు, ఆటవస్తువు దుకాణాలు వెలిశాయి. పలువురు ఉయ్యాయలు ఊగుతూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ఖిల్లారామాలయ చైర్మన్ జంగం శాంతయ్య, ఆలయ కమిటి సభ్యులు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూరమాధురి, ఆసది జితేందర్, తాజా మాజీ సర్పంచి గడ్డం రాధకృష్ణారెడ్డి, బూస సుదర్శన్, ఎజీ దాసు, విండోమాజీ చైర్మెన్ గజవాడ జైపాల్, వీడిసి కోశాధికారి తోట చిన్నసాయిలు, వారాల సాయిలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో గల అపురూప వెంకటేశ్వర ఆలయంలో సప్తాహ్నిక పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం హెూమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అమృత లత, వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు, రమాదేవి, అర్చకులు, ప్రజలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలకేంద్ర శివారులోని శ్రీగిరి క్షేత్రం గుట్టపై గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. వీర బ్రహ్మేంద్ర స్వామి,గోవిందమ్మల కళ్యాణోత్సవం కన్నుల పండుగల జరిగింది. అంతకు ముందు గ్రామంలోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామీ అలయం నుండి బ్రహ్మంగారి అలయం వరకు ఉత్సవ విగ్రహలను ఊరేగించారు. జాతరతో శ్రీగిరి క్షేత్రం కోలహలంగా మారింది. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ అధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. జాతర సందర్భంగా గుట్టపై తినుబండరాల దుకాణాలు, చిన్నారుల కోసం బొమ్మల దుకాణాలు వెలిశాయి. రాత్రికి గ్రామంలోని నరసింహ స్వామి ఆలయం నుండి శ్రీగిరి గుట్ట వరకు రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జాతరను పురస్కరించుకొని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంగిరేకుల మల్లేష్, ఉపాధ్యక్షుడు దండుగుల సాయిరాం, కోశాధికారి చిలివేరి భూమేశ్వర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన భీంగల్ సిఐ.....

శ్రీగిరి క్షేత్రం గుట్టపై పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతర ఉత్సవాల్లో భీంగల్ సిఐ ఎస్.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్న వితరణను ప్రారంభించి భక్తులకువడ్డించారు.

ముప్కాల్: ముప్కాల్ మండల కేంద్రంలోని దులగుట్ట పైన వెలసిన శ్రీ శివశ్రీనివాస కళ్యాణ మహెూత్సవం, మల్లన్న జాతర ఉత్సవాలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. భక్తులు మల్లన్నకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన సత్రం నిర్వహించారు. కార్యక్రమంలో ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగుంట లింగం, సెక్రటరీ గడ్డం గంగారెడ్డి, కోశాధికారి నరేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు శివ కుమార్, హైమద్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వెంచిర్యాల గ్రామంలో..

మండలంలోని వెంచిర్యాల గ్రామంలో 'శ్రీ బంగారు వెంకటేశ్వర స్వామి' ఆలయంలో భక్తుల నడుమ రథోత్సవం నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ఆర్మూర్ : మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ముజీగే మల్లన్న జాతర శనివారం సంబరంగా నిర్వహించారు. మల్లన్న దేవునికి నైవేద్యాలు సమర్పించారు. గుడి చుట్టూ దాదాపుగా మూడు కిలోమీటర్ల చుట్టూ షిడీతోపాటు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపు చూపరులను ఎంతో ఆకట్టుకుంది. పట్టణంతో పాటు పెర్కిట్, గోవింద్ పెట్, అర్గుల్, బ్రాహ్మణపల్లి, తొర్లికొండ గ్రామాల ప్రజలు పది వేలకుపైగా పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో శ్రీ ఆనందగిరి లక్ష్మి నృసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం రథోత్సవం ఘనంగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దండల మోహన్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ మాటుంగ ప్రశాంత్, వైస్ చైర్మన్ గడ్డం ముత్తెన్న, బాలయ్య, మాజీ ఎంపీపీ దికొండ శ్రీనివాస్, కిరణ్, సోషల్ మీడియా వారియర్ అజయ్, భక్తులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : జాతర సందర్భంగా ఏర్పాటైన దుకాణాలు



ఆర్మూర్‌లో..



మాక్లూర్



కమ్మర్‌పల్లిలో..



ముప్కాల్‌లో..



జక్రాన్‌పల్లిలో..

ప్లాట్లను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- రిటైర్డ్ ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తమ ప్లాట్స్ వేరే వారికి కట్టబెట్టి లాభం పొందాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయత్ రాజ్ టీచర్స్ కో- ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఎం. కిష్టయ్య, ఎం.గంగాధర్, డైరెక్టర్ ఎం.రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. 1991-92లో సొసైటీ వారు ఇతర భూములతో పాటు 171 సర్వే నంబర్‌లో 8 ఎకరాల ఐదు గుంటల భూమిని సంస్థ తరుపున రిజిస్టర్ చేసుకున్నామని అన్నారు. 81, 86లో 32 ఎకరాల భూమి వివిధ సర్వే నంబర్ లలో ఎడమ వైపు గిరిరాజ్ కలశాల, కుడి వైపు ఉన్న భూమిని సంస్థ కొనడం జరిగిందని తెలిపారు. మొత్తం 384 ప్లాట్స్ ఉన్నాయని అన్నారు. భూమిని విభజించి డ్రా ద్వారా డబ్బులు చెల్లించిన వారికి ప్లాట్స్ రిజిస్టర్ చేశామన్నారు. 171 సర్వే నంబర్ లో మొత్తం 13 ఎకరాల 35 గుంటల భూమి ఉందని, అందులో నాలుగు ఎకరాల మూడు గుంటల భూమి ప్రభుత్వ భూమి ఉందని, తొమ్మిది ఎకరాల ముప్పయి నాలుగు గంటల భూమి శ్రీ రాములు తండ్రి నర్సింలుకు చెందినది కాగా 8 ఎకరాల ఐదు గంటల భూమిని రిటైర్డ్ ఉద్యోగుల తాము కొనుగోలు చేశామని అన్నారు. అందులో అరు ఎకరాల ఎనిమిది గంటల భూమిలో 185 ప్లాట్స్ చేశామని అందులో 45 నుంచి 50 ప్లాట్స్ ఆక్రమించడం, కబ్జా చేయడం జరిగిందని అన్నారు. 1992లో లేఔట్ చేసిన ఎల్ పి నంబర్ 89/92 గల మా ప్లాట్స్‌లలో టీన్ షెడ్స్ వేసుకొని తమను అక్కడికి రానివ్వడం లేదని, వెళితే దౌర్జన్యం చేస్తున్నారని అన్నారు. మహిళలను తమపైకి ఉసిగొలిపి మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కలెక్టర్, కమిషనర్, మున్సిపల్ అధికారులకు సైతం దీనిపై విన్నవించామని తెలిపారు. ప్రజలకు, సమాజానికి సేవ చేస్తున్నామనే ముసుగులో ప్లాట్లను కొందరు ఆక్రమించాలని, వేరే వారికి కట్టబెట్టాలని చూస్తున్న వారిపై విచారణ జరిపి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అధ్యక్షులు ఎ. కిష్టయ్య, సెక్రటరీ ఎం గంగాధర్, కోశాధికారి కె భాగేందర్, ఉపాధ్యక్షులు టీ తారా చౌదరి, మాజీ సెక్రటరీ పి భోజ గౌడ్, డైరెక్టర్లు ఎం.రాజేశ్వర్ రెడ్డి, శ్రీరాములు గౌడ్, వసంతరావు, ఎల్లాగౌడ్, రాజేశ్వరి, దయశంకర్, సంతోష్ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు

ఎస్ఎంహెచ్ హాస్టల్ వార్డెన్స్ బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ ఎస్ఎంహెచ్ హాస్టల్స్ వార్డెన్ కి సంబంధించిన బిల్లులు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా హాస్టల్ వార్డన్స్ బిల్లులు పెండింగ్‌లో ఉండడం వల్ల హాస్టల్ నిర్వహణ చాలా కష్టంగా మారిందని అన్నారు. హాస్టల్ వార్డెన్స్అప్పులు తీసుకొచ్చి మరి నడుపుతున్నారని, కావున పెండింగ్లో ఉన్న హాస్టల్ వార్డెన్స్ బిల్లులు వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

బ్లడ్ డొనేషన్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీరామ హాస్పిటల్ యందు కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒకరికి శనివారం స్వామి బాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేట్ చేశారు. హెూంగార్డ్ స్వామి బ్లడ్ డొనేట్ చేయడంతో ఆయన సేవా నిరతికి పలువురు ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని 33/11కేవీ సిర్నపల్లి పరిధిలోగల సిర్నపల్లి, నల్లవెల్లి, డొంకల్ గ్రామ ప్రజలకు 33కెవి సిర్నపల్లి, 33కెవి మిషన్ భగీరథ ఫిడర్ పై విద్యుత్ అంతరాయాలు తగ్గించి, మెరుగైన విద్యుత్ సరఫరా చేయడానికి, లైన్‌ల మెయింటెనెన్స్ చేపట్టడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ఆపరేషన్ డిచ్ పల్లి జి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఆదివారం ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని

స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు సన్మానం



ఎస్‌హెచ్‌ఓను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ఇటీవల పట్టణ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా వచ్చిన రవి కుమార్‌ను శనివారం బిసి, ఎస్సీ, ఎస్టి, మైనారిటీ జిల్లా అధ్యక్షులు సుంకం.భూషణ్ కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పెరిగిపోయిన ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజగంగారాం, రాజశేఖర్ రావు, మురళి, యోగి, విజయ్ సింగ్, కుమార్, వికాస్, వెంకటేష్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధిని సాధించాలి

- సమగ్ర శిక్ష సోషల్ ఆడిట్ బృంద సభ్యుడు నాగరాజు

నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధిని సాధించాలని సమగ్ర శిక్ష సోషల్ ఆడిట్ బృంద సభ్యుడు నాగరాజు అన్నారు. పాఠశాల ద్వారా అందిస్తున్న సౌకర్యాలను పిల్లలు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని, పిల్లల సమగ్ర అభివృద్ధే విద్యాశాఖ సమన్వయంతో అందిస్తున్న సమగ్ర శిక్ష లక్ష్యమని తెలిపారు. ఆయన శనివారం నిజామాబాద్ రూరల్ మండలంలోని గూపన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు శకుంతలా దేవితో కలిసి ఉదయం ప్రార్థన సమయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం, న్యూట్రిషన్ అందించే రాగి జావా, పుస్తకాలతో నిండిన లైబ్రరీ, ఉచిత యూనిఫామ్ ఇలా అనేక సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధిస్తున్నారని శ్రద్ధ వహించి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. నో బ్యాక్ డే సందర్భంగా విద్యార్థులకు ప్రదర్శించిన కార్యక్రమాలను ఆయన తిలకించారు. లైబ్రరీ, సైన్స్ లాబ్, కంప్యూటర్ ల్యాబ్ పనితీరును పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మరుగుదొడ్లు, పాఠశాల మైదానం, మధ్యాహ్న భోజనం, తరగతి గదుల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనులో కేటాయించిన విధంగా మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు గాని అరటి పండు గాని తప్పనిసరిగా విద్యార్థులకు అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శకుంతలా దేవి, ఉపాధ్యాయులు జయసాగర్, కే మంజులత, కృష్ణారెడ్డి, శ్రీరామ్ లక్ష్మణ్, ఘనపురం దేవేందర్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న ఆడిట్ బృందం సభ్యులు

శ్రీ లక్ష్మి నరసింహ స్వామి అష్టమ వార్షికోత్సవం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కొనసముందర్ గ్రామంలో శనివారం శాలి వాహన కుమ్మరి సంఘం అధ్వర్యంలో శ్రీ లక్ష్మి నరసింహా స్వామి అష్టమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలతోపాటు స్వామివారి ఎదుర్కోలు, స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంకాలం కుంకుమార్చన పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం అధ్యక్షులు పోతుగంటి లింగయ్య, ఉపాధ్యక్షులు పోతుగంటి శ్రీనివాస్, కానూరు మోహన్, పోతుగంటి భాస్కర్, బలరాం, కృష్ణ, చిన్న గంగాధర్, అర్చకులు సుధాకర్ శర్మ అనుదీప్ శర్మ, సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
ఆదివారం | ఫిబ్రవరి 25, 2024 | www.navatelangana.com

ఎడపల్లిలో గోడప్రతుల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఎడపల్లి

మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభను జయప్రదం చేయాలని ఆయా పార్టీల నాయకులు ఎడపల్లి మండల కేంద్రంలో పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. మార్చ్ 3,4,5 తేదీలలో మహాసభ ఖమ్మంలో బహిరంగ సభ 20వేల మందితో నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మిద్దె నరేందర్, సిపిఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి డి.రాజేశ్వర్, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల షేక్ నసీర్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, ఎడపల్లి మండల అధ్యక్షులు శ్రీపతి మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం ఎడపల్లి మండలాధ్యక్షులు కె.సుదర్శన్, నాయకులు చింతల పోశెట్టి, సిద్ధ పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు



నవతెలంగాణ-మద్నూర్

గత ప్రభుత్వ హాయంలో నియమించిన మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గత పాలకవర్గాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ పాలకవర్గాలను రద్దు చేసినట్టు, పాలకవర్గాల రద్దుతో జిల్లా జేడీ ఇన్చార్జిగా అధికారుల పాలన కొనసాగించనున్నట్టు తెలిపారు. పాలకవర్గం రద్దు ఈ నెల 12న జరిగినట్లు ఈనెల 13 నుంచి జిల్లా అధికారి ఇన్చార్జిగా అధికార పాలన కొనసాగుతున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి తెలిపారు.



బిచ్కుంద: మాట్లాడుతున్న ఎంపీఓ మహబూబ్



గాంధారి: మాట్లాడుతున్న చందర్



జుక్కల్: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

- అధికారుల సూచన

నవతెలంగాణ-బిచ్కుంద

రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ప్రజలకు తాగునీరు సక్రమంగా అందే విధంగా చూడాలని మండల పంచాయతీ అధికారి మహబూబ్ అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీఓ మహబూబ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి మోటర్లు ఎన్ని ఉన్నాయో లెక్క తీసి అవి పని చేస్తున్నయా లేదా వివరాలు సేకరించి చెడిపోయిన వాటిని మరమ్మతులు చేయించాలని సూచించారు.

నీటి ట్యాంకర్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి లీకేజీ మరమ్మతులు చేసి నీరు వృథా పోకుండా ట్యాపులు బిగించాలని సూచించారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో బుధవారం అంగడి రోజున అంగడికి వచ్చే వ్యాపారస్తులకు ప్రజలకు తాగునీటిని అందించేందుకు గ్రామపంచాయతీ ప్రాంగణంలో తాగునీరు ఏర్పాటు, 13వ వార్డులో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ఎంపీవో దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలున్నచోట గుర్తించి వెంటనే సమస్యలు పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయాగ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వేసవికాలంలో నీటి కొరతలేకుండా అధికారులు తగినచర్యలు తీసుకోవాలి..

గాంధారి : వేసవికాలంలో నీటి కొరతలేకుండా అధికారులు తగినచర్యలు తీసుకోవాలని జెడ్.పి.సి.ఈ.ఓ, ఇంచార్జి పి.డి (డి.ఆర్.డి.ఏ) చందర్ అన్నారు. శనివారం మండలంలోని బూర్గుల్ గ్రామాన్ని సందర్శించి గ్రామ పంచాయతీ నర్సరీని తనిఖీ చేశారు. అనంతరం మండల కార్యాలయంలో గాంధారి మండలం గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌తో, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనులను ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తూ లేబర్ టర్నోవర్ పెంచాలని తెలిపారు. వేసవికాలంలో నీటి కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపిఓ రాజ్ కిరణ్‌రెడ్డి, ఎంఆర్ఓ సతీష్‌రెడ్డి, డి.టి.రవి, ఏఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ అముల్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి :ఎంపీడీవో శ్రీనివాస్

జుక్కల్ : నీటి సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శనివారం జుక్కల్ మండలంలోని 30 గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో మంచినీటి సరఫరాలో సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతరంగా నీటి సరఫరా జరిగే విధంగా ప్రతిపాదనలు సిద్ధంచేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అలాగే సంబంధిత గ్రామ పంచాయతీలలో వేసవి కాలంలో మంచినీటి సరఫరాపై ఎటువంటి సమస్యలు లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, అవసరమైన చోట్ల రిపేర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి పంచాయతీ కార్యదర్శులు అందరికీ సూచనలు చేశారు.



నాగిరెడ్డిపేట్ : ఎంపీడీఓ పర్బన్న

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి :ఎంపీడీవో పర్బన్న

నాగిరెడ్డిపేట్ : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పర్బన్న తెలిపారు. శనివారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేసుకోవాలని గ్రామాల్లోపల ప్రజలకు ఎలాంటి నీటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీఓ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రారంభమైన రేణుక జమదగ్ని ఉత్సవాలు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని శ్రీ రేణుక జమదగ్ని ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రేణుకా మాత అమ్మవారికి అఖండ దీపారాధన, స్వస్తిపుణ్యాహవాచనం, కాటమయ్య కోడిని ఎదుర్కొని అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

కండ్లకు గంతలు కట్టుకొని అయోధ్యకు మెజీషియన్లు



నవతెలంగాణ-కామారెడి

కండ్లకు గంతలు కట్టుకొని మెజీషియన్‌లు మారుతి జోషి, రామకృష్ణ బైక్‌పై అయోధ్యకు బయలు దేరినట్లు బిజెపి నాయకులు తెలిపారు. హైదరాబాద్ నుంచి అయోధ్య వరకు దాదాపు 1600 కిలోమీటర్ల వరకు కళ్ళకు గంతలు కట్టుకుని మోటార్ సైకిల్‌పైన యాత్ర చేస్తున్న మేజిషియన్‌లు మారుతి జోషి, రామకృష్ణ శుక్రవారం రాత్రి కామారెడ్డికి చేరుకున్నారు. వారికి కామారెడ్డి బిజెపి నాయకులు స్వాగతం పలికారు. శనివారం ఉదయం శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల నుంచి అయోధ్యకు బయలుదేరారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దల్, బీజేపీ నాయకులు వారి కండ్లకు గంతలు కట్టివారికి వీడ్కోలు పలికారు.

ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్ అవసరం

- డిసిసి ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి



నవతెలంగాణ-భిక్కనూర్

ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఎంతో అవసరమని డిసిసి ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి తెలిపారు. శనివారం వాంకన్ కరాటే దు ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాల నుంచి భిక్కనూర్ మండలంలో ట్రైన్ ద ట్రైనర్స్ ప్రాజెక్టులో భాగంగా ఆడపిల్లలకు ఉచితంగా సెల్ఫ్ డిఫెన్స్ నేర్పించడం అభినందనీయమని ప్రాజెక్టుకు స్పందిస్తూ 5 వేల రూపాయల విరాళాన్ని కరాటే నిర్వాహకులు ఎన్జీవో సెక్రటరీ ప్రియాంక, స్వాతిలకు అందజేశారు. కార్యక్రమంలో కరాటే నిర్వాహకులు శ్రీకాంత్, ప్రశాంత్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం




సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గుడిమేట్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్ నిధుల నుంచి గుడిమెట్ గ్రామానికి ఐదు లక్షల రూపాయల సిసి రోడ్డు నిర్మాణానికి కేటాయించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను గాంధారి ఎంపిటిసి సభ్యులు కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు తూర్పు రాజు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గాండ్ల లక్ష్మణ్, ఆకుల లక్ష్మణ్, సంగని బాబా, ఈశ్వర్ గౌడ్, ఆర్ల మధు, బాబురావు, రాజు, రమేష్, భోజరావు, మహేష్, సుభాష్, శివాజీ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారత సాధించాలి

- తహసీల్దార్ సునీత



మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత

నవతెలంగాణ-కోటగిరి

మహిళలు సాధికారత సాధించాలని తహసీల్దార్ సునీత అన్నారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంతి భవనంలో శనివారం మహిళలకు కుట్లు, అల్లికలు శిక్షణ కార్యక్రమాన్ని తహసీల్దార్ సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా, సాధికారికత సాధించినప్పుడే మహిళల్లో చైతన్యం కలుగుతుందని అన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, స్వావలంబన సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్స్, మనీ, సుమలత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బండివార్ విజయ్‌ను పరామర్శించిన ఎంపీ బీబీ పాటిల్



బండివార్‌ను పరామర్శించిన ఎంపీ

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి చెందిన పశు వైద్య డాక్టర్ గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బండివార్ విజయ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో చికిత్సలు జరుపుకొని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ అనారోగ్యానికి గురైన విషయాన్ని తెలుసుకున్న మద్నూర్ మండలానికి చెందిన సిర్పూర్ గ్రామ నివాసులు ప్రస్తుత జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ శనివారం నాందేడ్ జిల్లా కేంద్రానికి సందర్శించి విశ్రాంతి తీసుకుంటున్న డాక్టర్‌ను కలిసి పరామర్శించారు. ఎంపీ బీబీ పాటిల్ డాక్టర్ బండివార్ విజయ్‌తో మాట్లాడుతూ స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సలహాలు సూచనలు పాటించాలని ఎంపీ ఆయనను కోరారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

- సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంపత్



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సంపత్

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను శనివారం పోలీసులు ఏఎంవీఐ, నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ సంపత్ చర్చి వెనకాల ఉన్న 44వ జాతీయ రహదారి, జంగంపల్లి గ్రామ సమీపంలో ఉన్న సాయిబాబా టెంపుల్ వద్ద, పోలీస్‌స్టేషన్ వెనకాల ఉన్న పెట్రోల్ పంపు సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాదాల నివారణకు ప్రమాద సూచికలు, రైలింగ్ రాడ్లు, వైట్ బ్రేకర్స్, ఇండికేటర్లను ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో ఎఎంవిఐ సామ్ రీచార్డ్ సన్, ఎన్‌హెచ్ఎఐ అధికారులు పవన్, సాయి కృష్ణారెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి తదితరులున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించాలి

- బీటిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత 3 సంవత్సరాలకు సంబంధించిన ఇంజనీరింగ్ డిగ్రీ బి.ఎడ్ ప్రొఫెషనల్ కళాశాలకు సంబంధించిన 5500 కోట్ల పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరుతూ టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో 2000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యార్థులకు నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బంగారు తెలంగాణ పేరుతో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను చెల్లించకుండా విద్యార్థులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసినందుకుగాను తగిన మూల్యాన్ని చెల్లించుకుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5500 కోట్ల పెండింగ్ ఫీజు బకాయిలు ఉన్నాయని, ఈ బకాయిల విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బడుగు, బలహీన పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుందని అన్నారు. కళాశాలలో ఉన్న అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేక అద్దెలు కూడా కట్టలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్, జహీరాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు మోతే రాజిరెడ్డి, అంజల్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ పటేల్, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి పటోళ్ల మహిపాల్‌రెడ్డి, నిజామాబాద్ టీఎన్ఎస్ఎఫ్ ఇంచార్జ్ యూసప్ బిన్ అబుద్, రాష్ట్ర నాయకులు అవ్వత్, నాయకులు రాజు, సందీప్, నవీన్, వసంత్, ప్రదీప్, సంతోష్, నితీన్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీటీఎన్ఎస్ఎఫ్ నాయకులు

లెండి పనులపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు
- లెండి ప్రాజెక్ట్ మహారాష్ట్ర అధికారులతో సమీక్ష సమావేశం

నవతెలంగాణ-మద్నూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లెండి పనులపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. ఏండ్ల తరబడి అంతర్ రాష్ట్ర లెండి ప్రాజెక్టు నిర్మాణం పనులు ఎందుకు పెండింగ్‌లో ఉంటున్నాయో అనే దానిపై ఎమ్మెల్యే అంతరాష్ట్ర లెండి ప్రాజెక్టు మహారాష్ట్ర అధికారులతో శనివారం ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణం పనుల పెండింగ్ గురించి ఆరా తీశారు. అంతర్ రాష్ట్ర లెండి ప్రాజెక్ట్ పూర్తయితే జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, డోంగ్లి, బిచ్కుంద ఈ మూడు మండలాల పరిధిలో 22 వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. ఈ ప్రాజెక్టు దాదాపు 40 సంవత్సరాల కాలంగా పూర్తి కాకుండా పెండింగ్‌లోనే కొనసాగుతూ వస్తుంది.

ఘనంగా జడ్పీ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని మహ్మద్‌నగర్ గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్ దపేధర్ శోభ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయగౌడ్ మాట్లాడుతూ.. జన్మదిన వేడుకల సందర్భంగా మహమ్మద్‌నగర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పిల్లలకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేసినట్టు వివరించారు. అలాగే మాజీ ఉమ్మడి జెడ్పీ చైర్మన్ దాఫెదర్ రాజు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ కూడా గత 15 రోజుల నుంచి ఉదయం అల్పాహారం కూడా అందిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గునుకుల్ సొసైటీ చైర్మన్ వాజీద్అలీ, బీఆర్ఎస్ నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భూములను కాపాడాలని వినతి



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్ నిర్వాహకులు కళాశాల భూములను ఆక్రమిస్తున్నారని ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కామారెడ్డి స్టూడెంట్ ఫర్ సేవా టౌన్ ప్రెసిడెంట్ సంజయ్ మాట్లాడుతూ.. పది ఎకరాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం సమీపంలో వెలసిన వెంచర్ నిర్వహకులు కళాశాల భూములను ఆక్రమిస్తున్నారని రెవెన్యూ అధికారులు స్పందించి కళాశాల భూములను కాపాడాలని డిప్యూటీ తహసిల్దార్ రోజాకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు రాజేందర్, యోగేష్, ఆదర్శ్, సాయికుమార్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన, పేరు ప్రఖ్యాతులు కలిగిన ప్రైవేట్ పాఠశాలల నుంచి బెస్ట్ ఎవైలబుల్ స్కూల్ పథకం కింద (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) 2024-25 విద్యా సంవత్సరమునకు గాను ఆసక్తి కలగిన పాఠశాలల నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వ ఉతర్వులకు (రెసిడెన్షియల్ కేటగిరీకి రూ.42,000 అంతకంటే తక్కువ, నాన్-రెసిడెన్షియల్ కేటగిరీకి రూ.28,000 అంతకంటే తక్కువ) లోబడి దరఖాస్తులను కోరుతున్నట్టు

సంబంధిత శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచి మౌలిక వసతులు కలిగి, గడచిన 5 సంవత్సరములలో 7వ తరగతి, 10వ తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత, అందులో 50 శాతం ప్రథమశ్రేణి యందు ఉత్తీర్ణులై ఉండవలెనని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి, కామారెడ్డి జిల్లా కార్యాలయంలో తేదీ 27.02.2024 సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని సూచించారు. వివరాలకు రూమ్ నెం.113, ఫస్ట్ ఫ్లోర్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధిశాఖ అధికారి వారి కార్యాలయము, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి), కామారెడ్డి నందు కార్యాలయ పనిదినాల్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

మండల అభివృద్ధి అధికారిగా భాద్యతలు స్వీకరించిన సాయిరాంను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించినట్టు ఆలూరు తాజా మాజీ ఉపసర్పంచ్ దుమ్మాజీ శ్రీనివాస్ తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో దోమల బెడద చాలా ఉందని పరిశుధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలూరు బీఆర్ఎస్ యువజన మండల అధ్యక్షులు అగ్గు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కనీస గౌరవం ఇవ్వటం లేదు

- ఎంపీపీ, జెడ్పిటిసి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని శుక్రవారం జరిగిన బోగ్ బండార్ కార్యక్రమానికి కనీసం ప్రోటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ లతా కన్నిరాం, జెడ్పిటిసి కమల నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మాకు సమాచారం కూడా ఇవ్వలేదని, తాము ప్రజాప్రతినిధుల మేనని అన్నారు. బంజారా బిడ్డలమని కనీసం సేవాలాల్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన బోగ్ బండార్ ప్రభుత్వ కార్యక్రమానికి ఎమ్మెల్యే వచ్చిన కార్యక్రమానికి మమ్మల్ని పిలవకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సభలో తమను పిలిచి గౌరవించాల్సిన బాధ్యత అందరిపైన ఉంటుందని ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు ఇంకా పునరావృతం కాకుండా చూడాలని వారు మీడియా పరంగా సమావేశం నిర్వహించి తెలిపారు.

పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్ వద్ద గల ఆల్ఫోర్స్ నరేంద్ర పాఠశాలలో శుక్రవారం రాత్రి 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా ముఖ్యమైనదని, విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే అన్ని విషయాల పట్ల పట్టు సాధించాలని, తద్వారా సమాజంలో ఉత్తమమైన స్థానాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా ఉపాధి అవకాశాలను చాలా సులభంగా సద్వినియోగం చేసుకోగలుగుతారన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళిక బద్ధంగా ఉపాధ్యాయులు బోధించిన విషయాలను సమగ్రంగా సాధన చేసి విజయానికి చేరువ కావాలని మార్గదర్శకులుగా కొనసాగించాలని సూచించారు. తమ పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సాహం అందించడంతో పాటు పారితోషికాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. అహర్నిశలు కృషి చేస్తున్న పలువురు ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

మంగళసూత్రం అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శనివారం బ్రహ్మంగారి జాతర ఉత్సవాలలో దర్శనం కోసం వచ్చిన ఒక భక్తురాలు తన మంగళసూత్రం శ్రీ గురు క్షేత్రంపై గుట్టపైన పోగొట్టుకుంది. అట్టి మంగళసూత్రం జాతర ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన కమ్మర్‌పల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీ కుమార్‌కు దొరికింది. దానిని తీసుకొచ్చి ఆయన గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంగిరేకుల మల్లేష్‌కు అప్పగించాడు. ఈ విషయాన్ని మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేయడంతో మంగళసూత్రం పోగొట్టుకున్న మహిళ గుడి వద్దకు రావడంతో గ్రామ సంఘం సభ్యుల సమీక్షంలో పోగొట్టుకున్న మహిళకు మంగళసూత్రం అప్పగించారు. దొరికిన మంగళసూత్రాన్ని అప్పగించిన శ్రీకుమార్‌ను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అభినందించగా బాధితురాలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు అంగిరేకుల మల్లేష్, ఉపాధ్యక్షులు దండుగుల సాయిరాం, క్యాషియర్ చిలివేరి భూమేశ్వర్, గ్రామ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి త్రితల రాజగోపుర కలశ జీవద్వజ ప్రాణప్రతిష్ట మహోత్సవం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాదు నగరంలోని కోటగల్లి మార్కండేయ మందిరంలో ఈ నెల 25 నుంచి 29 వరకు శ్రీ భక్త మార్కండేయ సహిత శివపంచాయతన నవగ్రహ దేవాలయ త్రితల రాజగోపుర కలశ జీవద్వజ ప్రాణప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్టు నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్య చెప్పారు. మొదటిరోజు ప్రత్యేక పూజలు, 26న స్థాపిత దేవతాహోమములు జరుగుతాయన్నారు. 27న చండీహోమం, రుద్రహోమములు, 28న స్థాపిత దేవతా హోమములు ఉంటాయన్నారు. 29న యంత్ర గ్రహ ద్వజ త్రితల రాజగోపుర శిఖర ప్రతిష్టాపన, శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి శాంతి కల్యాణం కార్యక్రమాలు జరుగుతాయని నర్సయ్య వివరించారు. సమావేశంలో జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పుల్గం హన్మాండ్లు, నగర సంఘ బాధ్యులు గంట్యాల వెంకట్ నర్సయ్య, దాసరి గుండయ్య, కైరంకొండ విఠల్, బింగి మోహన్, మందిర కమిటీ చైర్మెన్ దేవదాస్, సిలివేరి శంకర్, చింతల గంగాదాస్, తుమ్మ నాగభూషణం పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి నల్లవెల్లి గ్రామల మధ్య ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో స్థానికులు ఇందల్ వాయి పోలీసులకు సమాచారం అందజేశారు. ఇందల్ వాయి ఇంచార్జీ ఎస్సై మనోజ్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని ఘటన జరిగిన స్థలం రైల్వే పరిధిలో ఉండటంతో రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర మార్చురీకి తరలించారు.మృతుడి వివరాలు ఇంక తెలియరాలేదని స్థానికులు తెలిపారు.

పౌరుల జీవించేహక్కులను హరించొద్దు

- చట్టపరిధిలో పనిచేస్తే విడిసిలకు సహకారం
- అనవసర చిక్కులలో పడరాదు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత
- చట్టవ్యతిరేకమైన చర్యలు సరికాదు
- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సునీత



పాల్గొన్న విడీసీ సభ్యులు, పోలీసులు, అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

చట్టం, హక్కులు, బాధ్యతలను ఎరుకజేసి, పౌరుల సామాజిక వెలివేతలు జీవించేహక్కులకు, సమానత్వానికి గొడ్డలపెట్టులా నిలవరాదని గ్రామ అభివృద్ధి కమిటీల సభ్యుల సమావేశంలో ఉద్బోధ చేసిన జిల్లాజడ్జి, పోలీస్ కమిషనర్ చట్టాల గూర్చి తెలిసిచేసిన, తెలియక చేసిన నేరం నేరమేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఛైర్ పర్సన్ సునీత కుంచాల తెలిపారు. చట్టపరంగా ఏమి చేయాలి.. ఏమి చేయకూడదు అనే న్యాయపరిజ్ఞానాన్ని తెలియజేయడానికి వీలుగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ అభివృద్ధి కమిటీల సభ్యులతో నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. చట్టపరిదిలో పనిచేస్తే సంతోషమేనని కాని చట్టవ్యతిరేకమైన చర్యలు ఆమోదయోగ్యం కావని అన్నారు. అనవసరమైన సమస్యలు సృష్టించి చట్టపరమైన చిక్కుల్లో చిక్కరాదనే అభ్యర్ధనను అర్ధం చేసుకుని మెలగాలని ఆమె కోరారు. గ్రామ అభివృద్ధి కమిటీలు చట్టాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేస్తే అన్ని ప్రభుత్వ శాఖల తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన కోసమే సదస్సులను ఆ దిశగా న్యాయసేవ సంస్థ కృషి చేస్తున్నదని తెలిపారు. పల్లెల ప్రగతితోనే భరతావని వికాసమని అందుకు ప్రతి పౌరుడు శ్రమించాలని, కాని గ్రామాల తిరోగమన దిశగా అడుగులు వేయరాదని జిల్లాజడ్జి అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్, మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కమిటీల పేరులో అభివృద్ధి అనే పదం ఉన్నదని దానిని తప్పు పట్టగలమా..అని ఆయన ప్రశ్నించారు. సమస్య ఎక్కడున్నదంటే అభివృద్ధి పేరున వేరొకరి అభివృద్ధిని సహజంగా జీవించేహక్కులను చెరిపి వేయరాదనే విషయాన్ని ప్రతివారు గౌరవించాలని తెలిపారు. కుల బహిష్కరణలకు పాల్పడడం, సామాజిక దండనలు, వెలివేతలు చేయడంతో పోలీసుశాఖ కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామస్తులు కలిసిమెలిసి జీవించడమే గీటురాయిగా ఉండాలని ఆకాంక్షించారు. చేసేపనులు చట్టవ్యతిరేకమైనవిగా ఉండరాదని, గ్రామ స్థాయిలో ఒక చట్టవ్యతిరేకమైన నిర్ణయం, తీర్మానం చేయరాదని అది అశాంతికి దారితీస్తుందని తెలిపారు. సమస్యలు ఉంటే ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకురావడం చేయాలని కోరారు. చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. గ్రామ అభివృద్ధి ఆలోచనలు అమృతమే కావాలికాని విషతుల్యం కావద్దని, మా ఆలోచనలకు, భావనలకు ఆచరణరూపం ఇవ్వాల్సింది గ్రామ అభివృద్ధి కమిటీలేనని ఆయన అన్నారు. చట్టపరంగా ఉంటే సమస్య లేదు కాని చట్టవ్యతిరేకమైన చర్యలకు దిగిన, ప్రోత్సహించిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే న్యాయసేవ సంస్థ ను ఆశ్రయించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రాజా వెంకటరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్, నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ, న్యాయసేవ సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీల సభ్యులు, వివిధ పోలీస్ స్టేషన్ ల అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య సమాజానికి అవసరం

- ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్

నవతెలంగాణ-ఆర్మూర్

క్రమశిక్షణతో కూడిన విద్య సమాజానికి అవసరం అని ఆక్స్‌ఫార్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ అన్నారు. పట్టణ శివారులోని గాంధీనగర్‌లో గల ఆక్స్‌ఫార్డ్ పాఠశాలలో శుక్రవారం రాత్రి పదవ తరగతి వీడ్కోలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరస్పాండెంట్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని, సమాజాన్ని సన్మార్గంలో నడిపించుటకు ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని పరీక్షల పట్ల భయాన్ని తొలగించుకోవాలని, జీవితంలో అన్ని సవాళ్లను ధైర్యంతో ఎదుర్కోవాలని తెలిపారు. వార్షిక పరీక్షల్లో విజయం సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం పాఠశాల పరిపాలన అధికారిని పద్మ మాట్లాడుతూ.. నృత్యం చేసిన విద్యార్థులను అభినందిస్తూ, పదవ తరగతి విద్యార్థులు పరీక్షల్లో అత్యధిక సంఖ్యలో 10 పాయింట్లు సాధించాలని, మీరు మీ భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాలని, ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు వారి అనుభవాలను, స్మృతులను, తోటి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పదవ తరగతి విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం 9వ, 10వ తరగతి విద్యార్థులు వారి నృత్యాలతో అందరిని అలరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలనాధికారిణి పద్మ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఇన్‌చార్జిలు స్వపన్, నాగరాజు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభ పరీక్షలు



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ పెర్కిట్ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభ పరీక్షలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో సైన్స్ యొక్క ప్రాధాన్యతను వివరించారు. నేటి సాంకేతికత ఎందరో శాస్త్రవేత్తల కృషి ఫలితమే అన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించాలని అన్నారు. ఈ పోటీలలో రాజేశ్వరి జెడ్పిహెచ్ఎస్ రావుట్ల, రితేష్ జడ్పిహెచ్ఎస్ వేల్పూర్, తపస్వి టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పోచంపాడు విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ఫోరం తరపున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఎస్‌టి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివప్రసాద్, పసుపుల రఘునాథ్, బయో సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, రాష్ట్ర సభ్యులు ఎంవీఆర్ చారి, డిస్ట్రిక్ సైన్స్ అధికారి గంగాకిషన్, డివిజన్ అధ్యక్షులు గంగాధర్, ఫోరం సలహాదారులు డాక్టర్ పోచన్న, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఫేర్‌వెల్

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు మరి లెక్చరర్ బృందం ఆధ్వర్యంలో వీడ్కోలు పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులు మరింత ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడి తల్లిదండ్రుల పేరు ప్రఖ్యాతలను తేవాలని అన్నారు. ఈ సందర్భంగా జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులతో తమ మధురానుభూతులను పంచుకుంటూ ఆత్మీయతను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి బానోత్ రఘురాం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి కార్యదర్శి బానోత్ రఘురాం ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక నిజామాబాద్ సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 28 నుంచి మార్చ్19 వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ పరీక్షలలో మొదటి, రెండవ సంవత్సరాలకు సంబంధించి సుమారు వేలాదిమంది విద్యార్థులు హాజరవుతున్నారని, పరీక్ష కేంద్రాలలో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ఉన్న పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలి సూచించారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర సహాయ కార్యదర్శి నవీన్ కృష్ణ, నాయకులు పవన్ కళ్యాణ్, వంశీ, రోహిత్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో మాతృ పితృ దినోత్సవం సందర్భంగా పాదాపూజా కార్యక్రమం పాజిటివ్ పేరెంట్ వర్క్ షప్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. పాజిటివ్ పేరెంట్ వర్క్ షాప్‌లో భాగంగా ముఖ్యఅతిథిగా మంగిరాములు మహారాజ్ పాల్గొన్నారు. పిల్లలకు తల్లిదండ్రులకు నైతిక విలువలను గురించి వివరించారు. శ్రీహరి మోటివేషనల్ స్పీకర్ పిల్లల పట్ల తల్లిదండ్రులు ఎలా ఉండాలో చెబుతూ వారి భవిష్యత్తు కార్యాచరణ ఎలా చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాఠశాలకు కరస్పాండెంట్ అరుణ్ సార్, ప్రిన్సిపాల్ రవికిరణ్, ప్రైమరీ ఇంచార్జ్ అఖిల, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మోడీ సర్కార్‌కు మూల్యం చెల్లించక తప్పదు

- ఢిల్లీలో రైతులపై కాల్పులు జరపడం సిగ్గుచేటు
- కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-విలేకరుల బృందం

భీంగల్ : ఢిల్లీలో శాంతియుతంగా ధర్నాలు చేస్తున్న రైతులపై కాల్పులు జరిపి ఒక రైతు మరణానికి కారణమైన బిజెపి ప్రభుత్వ దిష్టిబొమ్మను సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణ కేంద్రంలోని సుమంగళి చౌరస్తా వద్ద దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్) ఆర్మూర్ డివిజన్ నాయకులు రాజేశ్వర్, వి.సత్యక్క, భీంగల్ మండల కార్యదర్శి కే.రాజేశ్వర్. మండల నాయకులు జి.అరవింద్, సాయిరెడ్డి, అంబికా. గంగాధర్, మోహన్, అల్తాఫ్, పోషన్న, తదితరులు ఉన్నారు

సిరికొండ: ఢిల్లీలో రైతులపై కాల్పులు జరపడాన్ని ఖండిస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ ఆధ్వర్యంలో సిరికొండలోని తెలంగాణ చౌరస్తా సెంటర్లో శనివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్ రమేష్ మాట్లాడుతూ.. ఈనెల 21న ఢిల్లీలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తూ రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని అడిగిన పంజాబ్ తదితర రాష్ట్రాల రైతులపై బిజెపి ప్రభుత్వం పోలీసులతో కాల్పులు జరిపి ఒక యువరైతు ప్రాణాలను బలిగొని, మిగతా రైతులను గాయాల పాలు చేసి, తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఒక పక్క రైతు ప్రభుత్వమని రైతు రాజ్యమే ధ్యేయమని ప్రగల్భాలు పలుకుతూ మరోపక్క అదే రైతులపై కర్కశంగా వ్యవహరిస్తూ లాఠీలు, తూటాలతో అన్నం పెట్టే రైతులను కాల్చి చంపి, గాయపరచడం దుర్మార్గమని తెలిపారు. కాల్పుల్లో చనిపోయిన యువరైతు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రైతు కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని గాయపడిన రైతులకు రూ.5లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ (ఎం-ఎల్) మాస్‌లైన్, ప్రజా సంఘాల డివిజన్ నాయకులు, దామోదర్, బాబన్న రమేష్, లింబాద్రి, మండల నాయకులు, కిషోర్, నాగన్న, నిమ్మల, రాములు, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: అన్నదాత రైతన్నలను కాల్చి చంపిన నరేంద్ర మోడీ సర్కార్ మూల్యం చెల్లించక తప్పదని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు హెచ్చరించారు. రైతుల పంటకు గిట్టుబాటు, కనీస మద్దతు ధర ఇవ్వాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణ ఆపాలని, వ్యవసాయ వ్యతిరేక మూడు నల్ల చట్టాలను వాపస్ తీసుకోవాలని శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై ఫిబ్రవరి 21న అమానుషంగా కాల్పులు జరుపగా శుభకరన్ సింగ్ అనే రైతు మరణించడం జరిగిందని ఆయన తెలిపారు. భారత వ్యవసాయ రంగాన్ని బలిపీఠం ఎక్కించే కుట్ర చేస్తున్న నరేంద్ర మోడీ విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 24న నిరసన(బ్లాక్ డే) పాటించాలని అన్నారు. ఆర్మూర్ పట్టణంలో మామిడిపల్లి భగత్ సింగ్ చౌరస్తా వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఖాజా మొయినుద్దీన్, బీడిల మదర్, మగ్దుంపటేల్, వర్ధారెడ్డి, అన్సర్, పాషా ఎఐకెఎంఎస్ సాయన్న పివైఎల్ జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్.రవి, మండల సహాయ కార్యదర్శి హుస్సేన్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ : అన్నదాత రైతన్నలను కాల్చి చంపిన నరేంద్ర మోడీ సర్కార్ మూల్యం చెల్లించక తప్పదని ఐఎఫ్‌టియు నగర కార్యదర్శి ఎం.శివకుమార్ హెచ్చరించారు. నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని, నిర్బంధాన్ని ఆపాలని ఎం శివకుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు ఫిరోజ్ రైస్ వకీల్ లక్ష్మణ్ శంకర్ షాదుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భీంగల్‌లో...



సిరికొండ...



నిజామాబాద్‌సిటీ...

కళాశాలలో వసతుల కల్పన



నవతెలంగాణ-వర్ని

మార్చ్ నుంచి ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ నిర్వహణపై వడ్డేపల్లి గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎన్‌పురం గ్రామ పంచాయతీ సిబ్బందితో సెక్రటరీ సాయిలు శానిటేషన్ వర్క్ చేయించారు. అనంతరం పాడైన బోరు మోటార్లను, ప్రధాన కెనాల్ నుంచి డిస్ట్రిబ్యూషన్ కెనాల్‌లలో చెత్త చెదారాన్ని జేసీబీ ద్వారా తొలగించి ఎక్కడ మురుగు నీరు ఉండకుండా, రైతులకు సాగునీరు పోయేలా పారిశుధ్య పనులను పంచాయతీలో వేగవంతంగా చేపడుతున్నారు. ఇందుకు ప్రజలు సెక్రటరీ పనితీరుపై సంతృప్తి చెందుతున్నారు.

బీఆర్ఎస్ సంబరాలు



నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మండలాల అధ్యక్షులు ఏజాస్‌ఖాన్ ఆధర్వంలో శనివారం సంబురాలు జరుపుకున్నారు. ఎంపీపీ సునీత శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పది సంవత్సరాల శని పోయిందని, రాజీనామా చేయకుండా కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో జడ్పిటిసి శంకర్ పటేల్, నాయకులు పత్తి లక్ష్మణ్, సిద్ధూ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు అనిల్ కులకర్ణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌కు నారాయణ కాలేజీ గర్వకారణం

- ఏసీపీ రాజ వెంకట్‌రెడ్డి
- ఘనంగా నారాయణ కాలేజ్ 2వ వార్షికోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరానికి నారాయణ కాలేజీ గర్వకారణమని నగర ఏసీపీ రాజ వెంకట్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల బస్వాగార్డెన్స్‌లో నారాయణ జూనియర్ కాలేజ్ రెండో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ నగర ఏసీపీ ఎల్.రాజావెంకట్‌రెడ్డి, డీఐఈవో ఎల్.రఘురాజ్, నారాయణ కాలేజ్ కోర్ డీన్ యూ.వీరాంజనేయప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ కుంట లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరానికి నారాయణ కాలేజీ రావడం గర్వకారణమని కొనియాడారు. ప్రతి విద్యార్థి నిష్ఠతో సాధన చేస్తే ఏదైనా సాధ్యమని సూచించారు. అనంతరం డీఐఈఓ మాట్లాడుతూ.. నిజామాబాద్‌లోని విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి తల్లిదండ్రులు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో కళాశాల ఏవో శేఖర్, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోష్న, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ రాజ వెంకట్‌రెడ్డి



నృత్యాలు చేస్తున్న విద్యార్థినిలు

కాలువ పూడికతీత పనులు



కాలువ వద్ద పలువురు రైతులు

నవతెలంగాణ-పొతంగల్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ 28/1 డిస్ట్రిబ్యూటర్ కెనాల్ చెత్త పూడిక తీయించి చివరి ఆయకట్టు రైతులకు నీరు అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపీడీవోను సన్మానించిన కో ఆప్షన్ మెంబర్



ఎంపీడీవోను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పర్బన్నను శనివారం మండల కో ఆప్షన్ మెంబర్ షాహిద్ పాష శాలువాతో సత్కరించారు. ఆయన వెంట ఎంపీపీ రాజదాస్, నాయకులు గులాం హుసేన్, విక్రమ్, ఇమామ్, కలీం ఉన్నారు.

సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని ప్రారంభించండి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరానికి ఐటి పరిశ్రమల శాఖ మాత్యులు దుద్దీల్ల శ్రీధర్ బాబు విచ్చేసిన సందర్భంగా ఎన్సిఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ మళ్ళీ ప్రారంభించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం , అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మంత్రి కీ వినతి పత్రం అందజేశారు. సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య, బొడ్డు గంగారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగికి బదిలీలు సహజం

- బదిలీపై వెళ్తున్న అధికారులకు ఘనసన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజమేనని బదిలీపై ఎక్కడికి వెళ్లినా అంకిత భావంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ 7వ బెటాలియన్ డిచ్ పల్లి కమాండెంట్ బి. రాంప్రకాష్ అన్నారు. ఎడవ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న డిఎస్ఎస్ విష్ణు మూర్తి, ఎఓ సి. హంస రాణిలకు కమాండెంట్ బి. రాంప్రకాష్ శాలువ, పూలామాలతో ఘనంగా సన్మానించి బెటాలియన్ నుండి రిలివ్ చేశారు. కార్యక్రమం లో అసిస్టెంట్ కమాండెంట్ కె. బాస్కర్ రావు, అర్ఐలు పి. వేంకటేశ్వర్లు, యం. నరేష్, అర్. ప్రహల్లద్, అర్.యస్.ఐలు, సిబ్బంది మినిస్ట్రియల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మంచి సేవలను అందించాలి

- మీసేవ నిర్వాహకుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా లో శనివారం మీసేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవగాంధీ ఆడిటోరియం లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని నలుమూలల నుండి మీసేవ, ఆధార్, సిఎస్సి నిర్వాహకులు పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ హాజరై మాట్లాడుతూ.. మీ సేవలు ప్రజలకు ప్రభుత్వానికి వారదులని ప్రజలు ప్రభుత్వానికి సంబంధించిన అనేక సేవలను మీసేవ ద్వారా పొందుతున్నారని అన్నారు. అందుకే ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌లను సైతం మీసేవ కేంద్రాలకు అప్పజెప్పారని అన్నారు.

ప్రజలకు మంచి సర్వీస్‌ను అందజేసి ప్రజల వద్ద మన్ననలు పొందాలన్నారు. ఈ సందర్భంగా మీసేవ అసోసియేషన్ అధ్యక్షులు చందుపట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2011లో ప్రారంభ మైన మీసేవ కేంద్రాల నుండి నిత్యం ఎన్నో సర్వీస్‌లను ప్రజలకు అందజేసినా కనీసం కమిషన్ నెలకు 2 నుండి 3 వేలు కూడా మించడం లేదని వాపోయారు. నెల వచ్చే సరికి రూమ్ రెంట్, కరంట్ బిల్, నెట్ బిల్ మొత్తం కలిపి దాదాపు 15 వేల వరకు ఖర్చు అవుతుండటంతో ఫోన్ రీఛార్జ్ ను సైతం చేస్తూ ప్రైవేట్ ఆన్లైన్ సర్వీసులపై ఆధారపడి నెట్టుకోస్తున్నానని నిర్వాహకుల సమస లను అధికారులు రాష్ట్ర స్థాయి అధికారులకు తెలిపి కమిషన్ పెంచాలని కోరారు. ఒక మీసేవ నిర్వాహకుడు 1 నుండి 2 లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టి పని చేసిన నెలకు వచ్చే కమిషన్ సరిపోవడం లేదని, ఉపాధి ఇబ్బందిగా ఉందని, కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని వాపోయారు. ఉన్నత అధికారుల దృష్టి కి తీసుకు వెళ్లి ఉద్యోగ భద్రత, కమీషన్ పెంపు, కొత్త మీసేవలు ఇవ్వకుండా నియంత్రణ చేయాలని కోరారు. కొందరు ప్రైవేట్ ఇంటర్ నెట్ సెంటర్, ఆన్లైన్ సెంటర్ వాళ్ళు చేసే తప్పిదాల వల్ల మీసేవ నిర్వాహకులకు చెడ్డ పేరు వస్తుందని అన్నారు. మీసేవ కేంద్రాలు ప్రభుత్వ అధికారుల ఆధీనంలో కొనసాగుతాయి కావున నిర్వాహకులకు తప్పులు చేయడానికి అవకాశం ఉండదని, ప్రైవేట్, నెట్ కేఫ్ వాళ్ళ తప్పిదాలు మీసేవలపై పడి నిందలు వస్తున్నాయని అన్నారు. ఈ సమ్మేళనంలో పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొని పలు సర్వీ సులపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ఆర్డీఓ రాజేందర్, ఎఎల్ఓ యోహాన్, జిల్లా మీసేవ ఈడిఎం లు కార్తీక్, అర్జున్, సిఎస్సి డిఎం గౌతమ్ తహసీల్దార్‌లు అనిరుద్, నాగార్జున్, బాబూసింగ్, ఎంఎస్ఓ దాస్, జిల్లా మీసేవ అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షులు చందుపట్ల శ్రీనివాస్, కార్యదర్శి సీతారి క్షమీస్, ఉపాధ్యక్షులు గొనె విశ్వనాథం, కోశాధికారి సబ్బానీ దర్మానందం, సంయుక్త కార్యదర్శులు చుక్కల రాజేష్, ఆర్గనైజేషన్ కార్యదర్శి పెద్దోళ్ల కిషోర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు జీవిఆర్, ఫషీ హైమద్, బండి రవి, మండల స్థాయి అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో



పాల్గొన్న అధికారులు

ఇష్టానుసారంగా ఇండ్ల కేటాయింపు

- నియోజకర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి
- మ్యాని ఫెస్టోలోని హామీల సంగతిఏంటి?
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ పేదోని సొంత ఇల్లు సాకారం కోసం గత ప్రభుత్వం తీసుకొచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిజామాబాద్‌కు 2,330 మంజూరు అయితే పూర్తి అయినవి 648 అని, వీటి అభ్యర్థుల ఎంపిక కూడా జీవోకు వ్యతిరేకంగా జరిగిందని అన్నారు. గత ప్రభుత్వం ఒక వర్గానికి 48శాతం కేటాయించి మిగతా వర్గాల ప్రజలను మోసం చేసారని, కేటాయించిన వాటిలో కూడా బిఆర్ఎస్ నాయకుల అనుచరులకు, ఇల్లు ఉన్న వారికే ఇల్లు ఇచ్చారని విమర్శించారు. వెంటనే అర్హులైన పేదవారిని ఎంపిక చేసి, ఆ ఇళ్లను మరమత్తు చేసి ఇవ్వాలని, దానికి స్పెషల్ ఫండ్ కోటి ఇరవై ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలనీ డిమాండ్ చేసారు. జిల్లా మంత్రికి కూడా వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. కోట్ల రూపాయలు వచ్చిన నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వనంగా ఉందని తెలిపారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద 162 కోట్ల రూపాయలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం, వాటర్ సప్లై కోసం 217 కోట్ల రూపాయలు విడుదల చేసిందని తెలిపారు. నిధులతో త్వరతగతిన పనులు పూర్తి అయ్యేలా చూస్తానని హామీనిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అరుగ్యారెంటీలతోపాటు మేనిఫెస్టోలో ఉన్న హామీల సంగతి ఏంటి అని ప్రశ్నించారు. రైతులకు 2 లక్షల రుణమాఫీ, మహిళలకు 2500, నిరుద్యోగ భృతి, ఆరు గ్యారెంటీలు కూడా ఎన్నికల కోడ్‌కు ముందు అమలు చేయాలని, ఎన్నికల కోసం, ఓట్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలొ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్ లక్ష్మి నారాయణ, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్ మాస్టర్ శంకర్,మండల అధ్యక్షులు పుట్ట వీరేందర్, గడ్డం రాజు, రోషన్ లాల్ భోర, బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-సిరికొండ

బట్టు కృష్ణ నాయక్ స్మారక మండల స్థాయి(ఐదు మండలాలు) వాలీబాల్ టోర్నమెంట్ ముషీర్ నగర్ గ్రామంలో ఆదివారం నిర్వహించన్నునట్టు గ్రామభివృద్ధి కమిటీ, యువజన సంఘం వారు శనివారం తెలిపారు. మొదటి బహుమతి రూ.7,000, రెండవ బహుమతి రూ.5,000 ఉంటుందని చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన వివాహిత చౌటి లహరి(27) ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. లహరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని చెప్పారు. ఆమె తల్లి నర్రా సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చూస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని మెట్టుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించినట్లు వివరించారు.

బలవంతంగా రహదారి నిర్మిస్తే ఆత్మహత్య చేసుకుంటాం

- జాతీయ రహదారి విస్తరణ సర్వేను అడ్డుకున్న రైతులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్



మండలంలోని 63వ నంబరు జాతీయ రహదారి లక్కోరా, అంక్సాపూర్, పడగల్ వడ్డెర కాలనీ, కుక్కునూరు గ్రామాల పంట భూముల నుంచి రహదారి విస్తరణ సర్వేను శనివారం రైతులు అడ్డుకున్నారు. రహదారి సర్వే నిర్వహించడానికి హైవే పిడి అజయ్ మణికుమార్ ,జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు ,మండల రెవెన్యూ అధికారులు పంట భూముల వద్దకు రాగా రైతులు ఒప్పుకోలేదు. 63 నంబర్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిని లక్కోరా గ్రామం దాటిన తర్వాత పడగల్ వడ్డెర కాలనీ, అంక్సాపూర్, కుక్కునూరు గ్రామాల మీదుగా పంట భూముల నుంచి బైపాస్ రోడ్డు నిర్మించాలని హైవే అధికారులు ఇటీవల నిర్ణయించారు. తమకు ఆధారంగా ఉన్న పంట భూములు రహదారిలో కలిస్తే తాము ఎలా జీవించాలని రైతులు ప్రశ్నించారు. ఇప్పటికే వరద కాలువకు, రైల్వే లైన్ నిర్మాణానికి భూములు ఇచ్చి నష్టపోయామని, తిరిగి జాతీయ రహదారి విస్తరణకు పంట భూములు కోల్పోవాలా అంటూ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిని విస్తరించడంవల్ల నష్టం కొంచెమే జరుగుతుందని అది పంట భూముల నుంచి నిర్మిస్తే వందల ఎకరాలు నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోతే తిరిగి నిర్మించుకోవచ్చని భూములు పోతే దొరుకుతాయా? అని అధికారులను ప్రశ్నించారు. పంట భూముల నుంచి జాతీయ రహదారి వద్దని గ్రామపంచాయతీల ద్వారా తీర్మానం ఇచ్చిన గాని పరిగణలోకి తీసుకోవడం లేదని వాపోయారు. ఎట్టి పరిస్థితుల్లో రహదారి విస్తరణకు పంట భూముల ఇచ్చేది లేదని పేర్కొన్నారు. అధికారులు బలవంతంగా రోడ్డు నిర్మాణానికి పూనుకుంటే వారి ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని వాపోయారు.